సాక్షి తిరుపతి

శుక్రవారం : 21 : ఏప్రిల్ : 2023



పాలన వదిలేశా'రుయా'!

రాయలసీమకే తలమానికంగా నిలిచిన రుయా ఆస్పత్రి పాలన అస్తవ్యస్థంగా మారింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నగదు రూ.లక్షల్లో స్వాహా చేసినా ఇప్పటివరకు చర్యలు శూన్యమయ్యాయి. - 8లో



పీఎస్ఎల్‌వీ సీ55 అనుసంధానమిలా

షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి శనివారం పీఎస్ఎల్‌వీ సీ55 ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు రాకెట్ అనుసంధానం పనులు పూర్తిచేశారు. - 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	27
చిత్తూరు	39	26
తిరుమల	36	23
గూడూరు	41	28
నగరి	42	27

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం(సా)
తిరుపతి	6.30
చిత్తూరు	6.31
పుంగనూరు	6.33

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 3 కంపార్ట్‌మెంటులో నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 61,050 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,996 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో భక్తులు రూ.3.55 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారికి 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

పీపీపీ విధానంతో బస్టాండ్ల అభివృద్ధి



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

తిరుపతి అర్బన్: పబ్లిక్, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యం(పీపీపీ)తో ఆర్టీసీ బస్టాండ్లను అభివృద్ధి చేయనున్నట్లు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో ఆయన డీఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా జిల్లాలోని శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, పుత్తూరు, కోట ఆర్టీసీ బస్టాండ్లను పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. విధి విధానాలను డీఎంలకు తెలియజేశారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీకి చెందిన స్థలాలను 15 ఏళ్ల, 33 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి సిద్ధం చేయాలని చెప్పారు. అదనపు సమాచారం కోసం ఏఈ లక్ష్మీనారాయణ 96425 26400 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ చెన్నకేశ్వరావు, డిపో మేనేజర్లు రాజవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రశాంతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు తుది గడువు 30

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రేణిగుంట(బాలురు), శ్రీకాళహస్తి, కేవీ పల్లె, పీలేరులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్ డి.కొండిన్యసాయి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు ఉన్నాయని, ఇందులో ఎస్టీలకు 64 సీట్లు, ఎస్సీలకు 10, బీసీలకు 4, ఇతరులకు 2 సీట్లు వంతున కేటాయించినట్లు పేర్కొన్నారు. అలాగే 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మే 7వ తేదీన రేణిగుంట, శ్రీకాళహస్తి పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఆయా గురుకుల పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి ఉన్న వారు వాటిని పూర్తి చేసి, ఆయా పాఠశాలల్లోనే అందించాలని తెలిపారు. మరింత సమాచారానికి 96033 10648, 94909 57262, 94909 80563 నంబర్లలో సంప్రదించాలన్నారు.

23న నవోదయ నమూనా ప్రవేశ పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో ఈ నెల 23వ తేదీన ఉదయం 10 గంటలకు నవోదయ నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 29న జరగనున్న పరీక్షకు అనుగుణంగా నమూనా పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హాల్ టికెట్ జిరాక్స్ కాపీతో హాజరవ్వాలని కోరారు.

రూ.25.24 లక్షలకు ఐపీ

తిరుపతి లీగల్ : నగరంలోని నెహ్రూనగర్‌కు చెందిన భార్యాభర్తలు టి.వరప్రసాద్, టి.వరలక్ష్మి దంపతులు తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.25,24,642కు ఐపీ దాఖలు చేసినట్లు వారితరపు న్యాయవాది టి.మునిబాల సుబ్రమణ్యం గురువారం తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు.. గత 20 ఏళ్లుగా భార్యాభర్తలిద్దరూ తిరుపతిలో తోపుడుబండిపై గాజులను విక్రయిస్తూ జీవించేవారు. వ్యాపారం కోసం అధిక వడ్డీలకు అప్పు తీసుకున్నారు. పోటీ పెరగడం, వరప్రసాద్‌కు గుండె జబ్బు, వరలక్ష్మి క్యాన్సర్ బారిన పడడంతో ఇద్దరూ వ్యాపారం నిర్వహించలేకపోయారు. దీంతో అప్పు చెల్లించలేని స్థితిలో ఐపీ దాఖలు చేసినట్లు వారు పిటిషన్‌లో పేర్కొన్నారు.

బాబు భరోసా.. బ్రదర్స్ దందా



పంచాయితీలు.. సెటిల్‌మెంట్లు.. గంజాయి సరఫరా.. ఎర్రబంగారం దొంగ రవాణా.. ఏ అక్రమమైనా ఆ అన్నదమ్ములదేపై చేయి.. ఇందుకు తిరుపతి నగరంలో ఓ కార్యాలయం.. యువతకు వల.. ఓ ముఠా పోషణ.. వెరసి ఆ అన్నదమ్ములిద్దరూ రూ.కోట్లకు పడగలెత్తారు.. పచ్చపార్టీ అధినేత చంద్రబాబు భరోసాతో ఆ బ్రదర్స్ రెచ్చిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- తమ్ముడు ఒకప్పటి ఆటో డ్రైవర్.. అన్న టీటీడీలో మాజీ ఉద్యోగి
- గంజాయి అమ్మకాల నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ వరకు..
- ఆర్టీసీ బస్టాండ్.. రైల్వేస్టేషన్ల వద్ద అనుచరుల అడ్డా
- సెటిల్‌మెంట్ల కోసం తిరుపతిలో కార్యాలయం

సాక్షి, తిరుపతి: ఆ అన్నదమ్ముల దందాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. వారికి టీడీపీ అధినేత చంద్రబాబు వెన్నుదన్నుగా నిలిచారు. బాబు అండదండలతోనే తిరుపతి, పరిసర ప్రాంతాల్లో గంజాయి మొదలు.. మధ్యస్తాలు, సెటిల్‌మెంట్లు, ఎర్రచందనం అక్రమ రవాణాలో దూసుకుపోతున్నారనే విమర్శలు అమరావతి వరకు వినిపిస్తున్నాయి. తిరుపతిలో ఆ ఇద్దరు అన్నదమ్ములు రౌడీషీటర్లకు ఆరాధ్య దేవుళ్లు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ఆ అన్నదమ్ముల అనుచరులు చేసే దందాల్లో బ్రదర్స్‌కి వాటా ఉంది. వారిపై ఈగ వాలకుండా చూసే బాధ్యత ఆ సోదరులే తీసుకున్నారు. తిరుపతి నగరంలో గంజాయి, మద్యం సేవించి గొడవలు చేసే చిల్లర బ్యాచ్‌లకు ఆ అన్నదమ్ములు ఐకాన్‌లు. వారి జీవన గమనం ఎలా మొదలైందంటే.. అన్నదమ్ముళ్లల్లో చిన్నవాడు ఆటో డ్రైవర్‌గా జీవితం ప్రారంభించాడు. అన్న కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి జీవితాన్ని ప్రారంభించాడు. తమ్ముడు చేసే వెధవ పనులకు ఐడీ పార్టీలో పనిచేసే అన్న సహకారం ఉంది. చిన్నవాడు మొదటి నుంచి అల్లరి చిల్లరగా తిరుగుతూ గొడవలు చేసి స్థానికులు, యాత్రికులను కొట్టి డబ్బులు లాక్కోవడం అలవాటు. ఇందులో ఎవరైనా స్టేషన్ వరకు వెళ్లి కేసు పెట్టాలని చూస్తే అక్కడ అన్న మేనేజ్ చేస్తాడు. ఆయన కేసు పెట్టకుండా చేస్తారు. తిరుమలలో అన్నకు పోస్టింగ్ వచ్చినప్పటి నుంచి వారిద్దరు వెనక్కి తిరిగి చూసుకునే పని లేకుండా పోయింది. తిరుమలలో వ్యాపారుల మధ్యస్తాలు స్టేషన్‌కు వస్తే వారిని తిరుపతిలో ఉన్న తమ్ముడికి అప్పచెబుతాడు. దాన్ని పరిష్కరించే పనిలో అవతలి వారిని బెదిరించి, కొట్టి చిత్రహింసలకు గురి చేసి డబ్బు సంపాదించాడు అన్న.

వసూళ్లకు ఏ ప్రాంతమైతేనేం..

తిరుమలలో చిన్న సెటిల్మెంట్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. పెద్ద మొత్తంలో వసూళ్లు చేయడానికి బలిసినోళ్లు ఆ అన్నదమ్ములని తిరుమలలోని వ్యాపారులంతా చెబుతుంటారు. గొడవ చిన్నదైనా.. పగ తీర్చుకోవాలంటే ఈ అన్నదమ్ములకు చెబితే చాలు. అయితే వారు అడిగినంత ఇస్తే పనై పోతుందంటున్నారు. అలాగే ఏదైనా షాపుపై రైడ్ చేసి వారిని అక్కడ బెదిరిస్తే తిరుపతిలోనే సెటిల్మెంట్ చేస్తారు. ఇలా తిరుమలలో ఉన్న వ్యాపారుల నుంచి కోట్ల రూపాయలు సంపాదించారని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక ఎరచ్రందనం అక్రమ రవాణా కూడా చేయించి డబ్బు సంపాదించారు. ఇక దందాలను తిరుపతిలో మొదలుపెట్టారు. తిరుపతిలో అల్లరి చిల్లరగా తిరిగే యువతకు మద్యం, డబ్బు ఆశ చూపి, వారిని ఎన్ని విధాలుగా వాడాలో అన్ని విధాలుగా వాడేవారు. అలాగే గంజాయికి అలవాటు పడిన యువతకు ఆ ప్యాకెట్లు సరఫరా చేసి, అనుకున్నది సాధించుకునే వారు.

సెటిల్‌మెంట్ల కోసం ఓ ఆఫీస్

బిజినెస్ మ్యాన్ సినిమా టైప్‌లో ఈ ఇద్దరు అన్నదమ్ములు బాగా డబ్బు సంపాదించే సరికి తిరుపతిలో సెటిల్మెంట్ కోసం ఓ ఆఫీస్ తెరిచారు. అన్న ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి భూ దందాల నుంచి అక్రమ వ్యాపారాల వరకు ఏ ఒక్కటీ వదిలేవాడు కాదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. ఇక వీరి దగ్గర ఉన్న చిల్లర గ్యాంగ్ గొడవలు స్టేషన్‌కు వెళితే అన్న పలుకుబడితో తోటి కానిస్టేబుళ్ల ద్వారా వారిపై ఈగ కూడా వాలకుండా చూసేవారు. తిరుపతిలో కొన్ని హత్యల వెనుక వీరి హస్తం ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే వీరికి పలుకుబడి తగ్గడం, ఉద్యోగానికి లాంగ్ లీవ్ పెట్టి దందాలు కొనసాగిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం ప్రారంభించారు. చేసేది లేక అన్న తన ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీలో చేరి పోయాడు.

టీడీపీ అండతో రెచ్చిపోతున్న అన్నదమ్ములు

అన్నదమ్ములిద్దరూ టీడీపీలో చేరడం, చంద్రబాబుతో పరిచయాలు పెరగడంతో వీరి దందాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. రాజకీయ పలుకుబడితో గతం కంటే మరింత ఆగడాలకు తెరతీశారు. 2014 నుంచి 2019 వరకు ఆ అన్నదమ్ముల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. ఆ తరువాత వీరి ఆగడాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తమ్ముడిపై కేసు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేశారు. వీరితో పాటు ఉన్న అనుచరుల్లో చాలామందిపై రౌడీ షీట్‌లు ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద ఉన్న అనుచరుల్లోని రౌడీషీటర్లను ఆటో, జీపు డ్రైవర్లుగా సెట్‌చేసి పెట్టుకుని ఉన్నారు. చట్టంలోని లొసుగులు తెలిసిన ఈ అన్నదమ్ములు డబ్బులు ఖర్చు పెట్టుకుని చంద్రబాబు నాయుడు సహకారంతో రౌడీ షీట్ ఎత్తివేయించుకున్నారు. మొన్న లోకేష్ బాబు పాదయాత్రకు జన సమీకరణ, ఇతరత్రా ఖర్చుల కోసం ఎర్రచందనం స్మగ్లర్ల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు 2024 ఎన్నికల్లో వీరిలో ఒక వ్యక్తి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయాలన్న ఆలోచనలో ఉన్నాడు. ఎన్నికల్లో రూ.50 కోట్లు అయినా ఖర్చు పెట్టుకుంటానని లోకేష్‌కు చెప్పినట్లు టీడీపీలో చర్చ జరుగుతోంది. లోకేష్ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అభ్యర్థిత్వాన్ని ప్రకటించకపోవడానికి కారణం కూడా అన్నదమ్ముల పైరవీలేనని టీడీపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. ఇప్పటికీ వీరి చేతిలో దెబ్బలు తిన్న బాధితులు ముందుకు వచ్చి మాట్లాడాలన్నా స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నా భయపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

రీసర్వే వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీలు

తిరుపతి అర్బన్: భూముల రీసర్వే పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీతో కలసి కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పూర్తి అయిన చోట సరిహద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియ ఈ నెల చివరికి పూర్తి చేయాలని ఆదేశించారు. మరోవైపు జగనన్న లేఅవుట్లలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని వెల్లడించారు. ప్రతి వారం పురోగతి చూపాలని వెల్లడించారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్, పాలశీతలీకరణ భవనాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందనలో వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పర్యాటక శాఖకు చెందిన భూమి అలియనేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. వ్యవసాయరంగంతోపాటు అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. సీహెచ్‌సీ గ్రూపులను అదనంగా ఏర్పాటు చేసి, రైతులకు అవసరమైన పనిముట్లు సబ్సిడీ ద్వారా అందజేయాలని చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు మెరుగైన సేవలను ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ప్రాంతీయ సంచాలకులు రమణ ప్రసాద్, జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి విజయకుమార్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్ నారాయణ పాల్గొన్నారు.

ఒకటిన వాక్ ఇన్ సెలక్షన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్(ఎస్ఎల్ఎస్ఎంపీసీ) ఆధ్వర్యంలో తిరుపతిలోని టీటీడీ ఎస్వీ గోశాలలో గోవు పాలు పిండే ఉద్యోగాలకు మే 1వ తేదీన వాక్ ఇన్ సెలక్షన్లు నిర్వహించనున్నట్లు ఆ కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే టీటీడీ రవాణా విభాగం వర్క్‌షాపులో హెల్పర్ ఉద్యోగాల నియామకానికి మే 3వ తేదీన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు గోవు పాలు పిండేందుకు మే 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు ఎస్వీ గోశాలలో దరఖాస్తు, ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావ్వాలని, అలాగే హెల్పర్ల ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారు మే 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు టీటీడీ పరిపాలనా భవనం ప్రాంగణంలోని ఉద్యోగ విరమణ సమావేశ హాలులో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్పొరేషన్ వెబ్‌సైట్ అయిన ''ఎస్ఎల్ఎస్ ఎంపీసీ.ఇన్''ను సందర్శించాలని ఆయన కోరారు.

వైభవంగా తిరుపతి గంగ జాతర

- జాతరను దేశవ్యాప్తం చేద్దాం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- విస్తృత ఏర్పాట్లు

తిరుపతి తుడా: సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామివారి చెల్లెలైన తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో ఆ వేడుకను వైభవంగా నిర్వహించుకుందామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మనం నిర్వహించే గంగమ్మ జాతర ఉత్సవాలను దేశవ్యాప్తం కావాలని ఆయన ఆకాంక్షించారు. తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని చేయాల్సిన ఏర్పాట్లపై తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి గంగ జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇది తిరుపతి ప్రజలకు దక్కిన గౌరవం అన్నారు. మనకు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వేలాదిగా భక్తులు వస్తుంటారన్నారు. రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో జాతరకు మరింత విశిష్టత, ప్రాధాన్యత సమకూరిందన్నారు. పెద్ద ఎత్తున జాతర నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. జాతరలో అమ్మవారికి సారె సమర్పించే ఆనవాయితీని గుర్తించి, జాతర జరిగే ఎనిమిది రోజులపాటు సారె ఊరేగింపులు జరగాలన్నారు. మే ఒకటి నుంచి 5వ తేదీ వరకు ఆలయ మహా కుంభాభిషేకంతో జీర్ణోద్ధరణ కార్యక్రమం ఉంటుందన్నారు. 5వ తేదీన గర్భగుడిలో గంగమ్మను ప్రతిష్టించనున్నట్టు చెప్పారు. మే 9వ తేదీ నుంచి తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మొదలవుతుందన్నారు. తిరుమల శ్రీవారి ఆలయాన్ని దర్శించే ముందు తిరుపతి గంగమ్మను దర్శించి వెళ్లే సంప్రదాయాన్ని గత ఏడాది సీఎం జగన్ మోహన్ రెడ్డి కొనసాగించార చెప్పారు. గంగ జాతరను గంగమ్మ తల్లి బ్రహ్మోత్సవాలుగా జరుపుకుందామని ఎమ్మెల్యే ప్రకటించారు. జాతరకు సంబంధించి తిరుపతిలో రెండున్నర లక్షల కరపత్రాలు, రెండు లక్షల కుంకుమ ప్యాకెట్లు ప్రతి ఇంటికీ పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. గంగ జాతరకు ప్రతి ఇంటికీ ఆహ్వానం పంపనున్నట్టు తెలిపారు. నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది మన గంగమ్మ తల్లి పండగను కుటుంబ సమేతంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఇంటి నుంచి సారె తీసుకురావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ జాతరకు అవసరమైన ఏర్పాట్లను సకాలంలో చేస్తామని చెప్పారు. మెరుగైన పారిశుద్ధ్యంతోపాటు చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు, కమాండ్ కంట్రోల్ నిర్వహణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీషకు చెక్కును అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ హరిత

జాతరకు రూ.25 లక్షలు

కౌన్సిల్‌లో తీర్మానం చేసిన మేరకు తిరుపతి గంగ జాతర నిర్వహణకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.25 లక్షల చెక్కును ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు గంగమ్మ ఆలయ ఈఓ మునికృష్ణయ్యకు అందజేశారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, సంజీవ్ కుమార్, దేవిక, గోమతి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

చంద్రగిరి.. ఆరోగ్య సిరి

సంపూర్ణ ఆరోగ్యానికి మించిన ఐశ్వర్యం లేదు.. ఎంత ఐశ్వర్యం ఉన్నా అనారోగ్యం బారిన పడితే ఆ జీవితం నరక ప్రాయమే.. అందుకే ఆరోగ్యమే మహా భాగ్యం అని తలిచారు ఆయన. తన నియోజకవర్గంలో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదని.. సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని నిర్ణయించుకున్నారు. అందుకే శిశువు నుంచి కాటికి కాళ్లు చాపిన వృద్ధుడి వరకు ఆరోగ్యవంతులుగా ఉండాలని భావించారు. చంద్రగిరిని.. ఆరోగ్యసిరిగా మార్చేందుకు కంకణం కట్టుకుని ముందుకు సాగుతున్నారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.

- 4.30 లక్షల మందికి రూ.3100 విలువైన ఉచిత వైద్య పరీక్షలు
- ఒకసారి రక్త సేకరణతో 58 పరీక్షలు
- ఈసీజీ, డాప్లర్ టెస్ట్‌లు సైతం...
- 26న దామలచెరువులో ప్రారంభం



యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న జిల్లా అధికారుల బృందం, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

తిరుపతి రూరల్: ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ...చంద్రగిరి నియోజకవర్గాన్ని ఆరోగ్య సిరిగా మార్చేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారు. చంద్రగి నియోజకవర్గంలో ఉన్న 4.30 లక్షల మంది ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించడానికి రంగం సిద్ధం చేశారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ వారి గ్రామంలోనే వైద్యపరీక్షలు చేయనున్నారు. వందలాది మంది వైద్య సిబ్బంది, వేలాది మంది వలంటీర్లు, అధికారుల బృందం ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యులు కానున్నారు. దేశ చరిత్రలోనే ఏ నియోజకవర్గంలోనూ ఇలా మూకుమ్మడిగా ప్రతి ఒక్కరికీ వైద్య, ఆరోగ్య పరీక్షలు చేసిన చరిత్ర లేకపోవడం గమనార్హం. ఇందుకోసం ప్రివియా హెల్త్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు.

4.30 లక్షల మందికి పరీక్షలు

వ్యాధులు ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వాటిని నివారించేందుకు, వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. వ్యాధులను గుర్తించే పరీక్షలను చేసుకో వడంలో అలసత్వమే ఇందుకు కారణం. వ్యాధి ముదిరిన తర్వాత చేసే ఖర్చు కన్నా వాటిని ముందుగానే గుర్తించడం మేలని ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తలిచారు. అందులో భాగంగా తుడా తరుపున ప్రివియా హెల్త్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. రూ.3100 విలువ చేసే 58 రకాల రక్త, వైద్య పరీక్షలను ప్రజలందరికీ ఉచితంగా చేయించాలని నిశ్చయించారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్, అధికారులతో చర్చించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని దాదాపు 4.30 లక్షల మంది ప్రజలకు ఉచితంగా వైద్య, ఆరోగ్య పరీక్షలు చేయనున్నారు.

24న కలెక్టరేట్.. 26న దామలచెరువులో..

అందరికీ వైద్య పరీక్షలు...నినాదంతో ప్రతి ఒక్కరికీ వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ఇప్పటికే వలంటీర్ల ద్వారా ప్రాథమిక సమాచార సేకరణ పూర్తి చేశారు. 24న జిల్లా కలెక్టరేట్ పనిచేస్తున్న దాదాపు 550 మంది ఉద్యోగులకు కలెక్టరేట్‌లోనే వైద్య పరీక్షలు చేస్తారు. 26న పాకాల మండలం దామలచెరువు జెడ్పీ హైస్కూల్లో 4.30 లక్షల మంది ప్రజలకు వైద్య పరీక్షల కార్యక్రమాన్ని లాంఛనం ప్రారంభించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

చంద్రగిరి ఏరియా ఆస్పతిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ ల్యాబ్‌లో వైద్య, ఆరోగ్య పరీక్షల ప్రక్రియను జిల్లా అధికారుల బృందం గురువారం పరిశీలించింది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, తహసీల్దార్ శిరీషా, ఎంపీడీఓ రమేష్‌బాబు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరి ప్రసాద్ సందర్శించారు. యంత్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనాల సేకరణ, వాటికి బార్‌కోడ్ ద్వారా ట్రాకింగ్ చేసే విధానం, ఫలితాల వెల్లడి తదితర అంశాలను ప్రివియా హెల్త్ కంపెనీ ప్రతినిధి ఫణి అధికారులకు వివరించారు.

చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి చేరిన అధునాతన యంత్రాలు

నియోజకవర్గంలోని ప్రతి ఇంట్లో వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. చంద్రగిరి ఏరియా ఆస్పత్రిలో సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గంటకు 6200 పరీక్షలు చేసే రెండు బయోకెమిస్ట్రీ మిషన్లు, గంటకు 400 పరీక్షలు చేసే ఇమ్యూనో ఎనలైజర్ యూనిట్లు, గంటకు 160 రక్త పరీక్షలు చేసే రెండు సెల్స్ యూనిట్లు ఇప్పటికే సెంట్రల్ ల్యాబ్‌కు చేరుకున్నాయి. రిజిస్ట్రేషన్ నుంచి రక్తసేకరణ చేసి వాటిని పక్కాగా పరీక్షలు చేసి ఫలితాలను ప్రకటించే వరకు అత్యాధునిక టెక్నాలజీతో ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మా ఇళ్ల స్థలాలను కాపాడండి సారూ!



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న కదూరు గ్రామస్తులు

వరదయ్యపాళెం: మండలంలోని కదూరు కూడలి వద్ద కదూరు గ్రామస్తులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల చుట్టూ కంచె వేసే పనులు చేపట్టి, కల్కి ట్రస్టు ఆక్రమించుకోవడంతోపాటు దౌర్జన్యం చేస్తుందని బాధిత మహిళలు గురువారం సాయంత్రం వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కదూరు గ్రామానికి చెందిన ఇళ్ల స్థలాలు లేని 68 మంది లబ్ధిదారులకు 2008లో సమీపంలోని కదూరు కూడలి వద్ద ప్రభుత్వం డీకేటీ భూముల్లో ఇళ్ల స్థలాలను పంపిణీ చేసిందన్నారు. అయితే వారం రోజులుగా కల్కి ట్రస్టుకు చెందిన కొందరు సంబంధిత భూముల్లో కంచె వేసే పనులు ప్రారంభించారన్నారు. ఈ విషయం తెలుసుకున్న తాము కంచెను తొలగించి పనులను అడ్డుకున్నామని చెప్పారు. అయితే ట్రస్టు యాజమాన్యం భూములను వదిలి వెళ్లాలని తమను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డికి వారి వద్ద ఉన్న ఇంటి స్థలాలకు చెందిన పట్టాలను చూపి ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ వారుతో చర్చించి, పూర్తి స్థాయి రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని బాధిత మహిళలకు ఎస్‌ఐ హామీ ఇచ్చారు. అప్పటివరకు ఇరువర్గాలు పనులు చేపట్టకుండా ఉండాలని సూచించారు.

పాలన వదిలేశా'రుయా'!

శాశ్వత అధికారి లేమి.. పడకేసిన పర్యవేక్షణ.. ఊసేలేని పారదర్శకత.. జవాబుదారీతనం..అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహణ.. వెరసి అవినీతి అక్రమాలకు ఆజ్యం.. పాలనా లోపం.. ఫలితంగా రాయలసీమకే తలమానికంగా నిలిచిన సర్వజన ఆస్పత్రికి తలవొంపులు.. ఇన్‌చార్జుల పాలనతో ఇదీ రుయా దుస్థితి.

- అక్రమార్కులకు అడ్డాగా రుయా
- స్పందించని ఉన్నతాధికారులు

తిరుపతి తుడా: నగరంలోని రుయా ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జులు కొనసాగుతుండడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలోనే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ నగదు రూ.లక్షల్లో స్వాహా చేసినా ఇప్పటివరకు చర్యలు శూన్యమయ్యాయి. ఏడాదిన్నరగా ఆరోగ్యశ్రీ బాధితుల వివరాలను నమోదు ప్రక్రియను బయట వ్యక్తులతో చేయిస్తూ వచ్చారు. ఇందుకు గత సూపరింటెండెంట్ ఏడుగురిని డీఈఓలుగా అనధికారికంగా నియమించి, కొనసాగించారు. అనధికారికంగా కొనసాగుతున్న వారు ఆరోగ్యశ్రీ డబ్బులు స్వాహా చేశారు. వారి అక్రమాలు వెలుగులోకి రావడంతో వారిపై కేసు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇందుకు బాధ్యత వహించాల్సిన సూపరింటెండెంట్, విభాగాధిపతులు, మెడికల్ సిబ్బందిపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు.

అవినీతికి నిదర్శనాలివీ..

- గత డిసెంబర్‌లో బయట వ్యక్తి సదరమ్ సర్టిఫికెట్లు తీయిస్తానని పేదల నుంచి రూ.లక్షలు వసూలు చేసి పరారయ్యాడు.
- సుబ్రహ్మణ్యం అనే బయట వ్యక్తి ఇటీవల చిత్తూరు జిల్లాలోని నింద్ర మండలానికి చెందిన నిరుపేద వద్ద సదరమ్ సర్టిఫికెట్ ఇప్పిస్తానని రూ. 50 వేలు లాగేశారు. ఇతడిపై గతంలో ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోకపోవడంతో అతను అక్రమాలు కొనసాగిస్తూనే ఉన్నాడు.
- చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఓ ఉద్యోగి వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చేందుకు నిర్ణయించుకున్నాడు. ఇందుకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్ కోసం రుయాలోని ఓ ఉద్యోగిని సంప్రదించాడు. రూ.5 లక్షలు తీసుకుని మెడికల్ కమిటీ సిఫార్సు లేకుండానే ఆ వ్యక్తికి మెడికల్ సర్టిఫికెట్ మంజూరు చేయించిన ఘటన ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ విషయం నిర్ధారణ అయినా నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



ఆరోగ్యశ్రీ అక్రమాలపై విచారించి బయటకు వస్తున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

నివేదిక ఇచ్చాం

సంతకాల ఫోర్జరీపై నివేదిక ఇచ్చాం. ఆసరా అక్రమాలపైన పోలీసులకు ఫిర్యాదు చేశాం . అలానే దీనిపై ఆస్పత్రి నివేదికను సైతం విజిలెన్స్ కమిటీకి అందజేశాం.

– డాక్టర్ నాగ మునీంద్రుడు, రుయా సూపరింటెండెంట్

పాలన లోపమే కారణమా?

రుయా సూపరింటెండెంట్‌గా ఏడాది క్రితం డాక్టర్ భారతి ఉద్యోగ విరమణ చేశారు. ఆపై ఇద్దరు వైద్యులు ఇన్‌చార్జులుగా కొనసాగారు. ప్రస్తుతం నాగ మునీంద్రుడు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల ఈ యన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో రెండు మూడుసార్లు సెలవు పెట్టారు. ఈ క్రమంలో ఇన్‌చార్జిగా వచ్చిన డాక్టర్ సురేశ్వర్ రెడ్డి గతంలో జరిగిన అక్రమాలను గుర్తించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు చర్యలకు దిగారు. ఈ విషయాలపై కూపీ లాగడంతో ఎక్కడ తాను చేసిన అక్రమాలు వెలుగులోకి వస్తాయోనని భయపడిన గతంలో పనిచేసిన ఓ మహిళ సూపరింటెండెంట్ తన పలుకుబడిని వినియోగించి, సెలవులో ఉన్న నాగమునింద్రుడిని తీసుకువచ్చి మళ్లీ ఇన్‌చార్జిగా కూర్చోబెట్టించారు. కాగా ఆరోగ్యశ్రీ అక్రమాల పై తనిఖీలు చేసేందుకు వచ్చిన విజిలెన్స్ అధి కారులు సైతం పాలనాపరమైన లోపాలతోనే ఇక్కడ అక్రమాలు జరుగుతున్నాయని గుర్తించి, మందలించిన విషయం తెలిసిందే. ఇందుకు గత సూపరింటెండెంట్‌తో పాటు ప్రస్తుత ఇన్‌చార్జి అధికారి కూడా బాధ్యత వహించాల్సిందేనని మందలించినట్లు సమాచారం.

ఈ క్రమంలోనే అక్కడి ఉద్యోగులతో పాటు బయట వ్యక్తులు సైతం రుయాను వేదిక చేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,440
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,577
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,700
రిటైల్ వెండి గ్రాము	రూ.79.70

మూల్యాంకన రెమ్యూనరేషన్ పెంపుపై హర్షం



ఎస్.బాలాజీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆపస్

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకన రెమ్యూనరేషన్‌ను దాదాపు 50 శాతం మేర పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలాజీ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 2016లో ఉన్న రెమ్యూనేషన్‌నే పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి ఇచ్చేవారని తెలిపారు. రెమ్యూనేషన్‌ను పెంచాలని గత వారం ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డిని ఆపస్ తరపున కలిసి విజ్ఞప్తి చేశామని, తమ విన్నపాన్ని పరిశీలించిన ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. రెమ్యూనేషన్‌ను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై ఉపాధ్యాయులందరి తరపున ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ కార్యాలయంలో వ్యక్తి హల్‌చల్

- పట్టా రద్దు చేశారంటూ ఆత్మహత్యా యత్నం



నిరసన వ్యక్తం చేస్తున్న రేణుబాబు

పిచ్చాటూరు: తన ఇంటి పట్టా రద్దు చేశారని, దాన్ని తిరిగి మంజూరు చేయాలంటూ పురుగు మందు తాగేందుకు యత్నిస్తూ ఓ వ్యక్తి రెవెన్యూ కార్యాలయంలో గురువారం హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళితే.. నాగలాపురం మండలం సురుటపల్లి గ్రామానికి చెందిన రేణుబాబు ఉదయం 11 గంటలకు రెవెన్యూ కార్యాలయానికి వచ్చాడు. గ్రామసభలో తన భార్య పేరిట మంజూరైన ఇంటి పట్టా రద్దు అయినట్లు సర్పంచ్ సమక్షంలో వీఆర్వో చంద్రశేఖర్ ప్రకటించాడని తహసీల్దార్‌తో రేణుబాబుతో వాగ్వివాదానికి దిగాడు. తహసీల్దార్ ప్రసన్నకుమార్ సంబంధిత వీఆర్వోకు ఫోన్ చేసి, పిలిచే లోపే రేణుబాబు తనతో తెచ్చుకున్న పురుగు మందును తీసి తాగే ప్రయత్నం చేశాడు. దీనిని గమనించిన అక్కడున్న వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే కొంత పురుగుమందు నోట్లోకి వెళ్లింది. కార్యాలయ ఉద్యోగులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి రేణుబాబును నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రేణుబాబుకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

ఇంటి పట్టా మంజూరైంది

రేణుబాబు భార్య దీప ఇచ్చిన దరఖాస్తు మేరకు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. సురుటపల్లి జగనన్న కాలనీలో లబ్ధిదారు దీపకు ఇంటి పట్టా మంజూరు కూడా అయినట్లు ఆన్‌లైన్‌లో చూపుతుంది. బాధితునితోపాటు దరఖాస్తు చేసుకున్న వారందరికీ పట్టా కాపీ ప్రింట్ అయి రావాల్సి ఉంది. వారం రోజుల్లో పట్టా వస్తుంది. వెంటనే పంపిణీ చేస్తాం. ప్రస్తుతం అయితే ఆన్‌లైన్‌లో పట్టా కాపీని స్థానికంగా ప్రింట్ తీసి లబ్ధిదారునికి ఇస్తాం. గ్రామసభ విషయాలు తన దృష్టికి రాలేదు.

–ప్రసన్నకుమార్, తహసీల్దార్, నాగలాపురం

రూ.11లక్షల విరాళం





విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ ఆకేపాటి చెంగల్‌రెడ్డి మనవడు ఆకేపాటి విక్రమ్‌రెడ్డి గురువారం రూ.10,01,016 విరాళంగా అందజేశారు. అలాగే మచిలీపట్టణానికి చెందిన కొట్టంలంక ఉషారాణి జ్ఞాపకార్థం ఆయు కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యులు మహేందర్ రెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణల సారథి సంతోషరావు

- ఎస్పీడీసీఎల్ సీఎండీగా మరోసారి పట్టం
- నేడు బాధ్యతల స్వీకరణ



తిరుపతి రూరల్: వేగవంతమైన నిర్ణయాలు..విజ్ఞప్తులపై సత్వర స్పందన...బకాయిలు రాబట్టడంలో కరుకుదనం..ఆలస్యం లేకుండా ఫైళ్లను క్లియర్ చేసి ఎస్పీడీసీఎల్ పరిధిలో విద్యుత్ వ్యవస్థను పటిష్టతకు చర్యలు.. వెరసి సంస్కరణల సారథిగా పేరుగాంచిన వ్యక్తి సంతోషరావు. ఈయన ఎస్పీడీసీఎల్ ఇన్‌చార్జి సీఎండీగా తొమ్మిది నెలల వ్యవధిలోనే విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికారు. విధి నిర్వహణలో ఆయన పాలనాదక్షతను మెచ్చిన ప్రభుత్వం ఎస్పీడీసీఎల్ సీఎండీగా రెండేళ్ల పాటు నియమిస్తూ జీవో జారీ చేశారు. శుక్రవారం ఆయన తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

రికార్డు స్థాయిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులు

వ్యవసాయ విద్యుత్ సర్వీసుల జారీలో ఆయన ప్రత్యేక చొరవ చూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో కేవలం తొమ్మిది నెలల కాలంలో 65,207 వ్యవసాయ విద్యుత్ సర్వీసులను విడుదల చేశారు. గత ఏడాది జులై నాటికి 54,577 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు పెండింగ్‌లో ఉండగా ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆ సంఖ్య 7129కి తగ్గడం గొప్ప విషయం.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు

జగనన్న కాలనీల విద్యుద్దీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎండీగా సంతోషరావు ప్రత్యేక చొరవ చూపారు. సంస్థ పరిధిలో చేపడుతున్న జగనన్న కాలనీల్లో 1308 లే అవుట్ల విద్యుద్దీకరణ పనులను చేపట్టారు. వీటికోసం ఇప్పటివరకు 3408 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, 554.94 కిలోమీటర్ల మేరకు 11 కేవీ లైన్లు, 3070.96 కిలోమీటర్ల ఎల్‌టీ లైన్లను ఏర్పాటు చేశారు.

పైనుంచి పడి కూలీ మృతి

తిరుపతి క్రైమ్: పెయింటింగ్ పను లు చేస్తున్న ఓ కూలీ ప్రమాదవశాత్తు అకస్మాత్తు గా 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడి మృతి చెందిన సంఘటన రాయల్‌నగర్‌లో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. యూనివర్సిటీ పోలీసుల కథనం మేరకు.. కొర్లగుంట జంక్షన్‌లో నివాసం ఉన్న నిర్మల్ (50) పెయింటింగ్ పనులు చేసుకుంటున్న జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన రాయల్ నగర్‌లో ఓ భవనానికి రంగులు వేయడానికి కూలి పనికి వెళ్లాడు. పనులు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడ్డాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడి పేరు మాత్రమే స్థానికుల ద్వారా తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు తెలిపారు.

అవయవదానంపై అవగాహనకు చర్యలు

- టీటీడీ ఉద్యోగులకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు
- టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి తుడా: అవయవదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి పేర్కొన్నారు. ముందుగా టీటీడీ ఉద్యోగులకు, అలానే ప్రజలకు అవయవదానంపై పూర్తి అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లా అధికార యంత్రాంగం, తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. టీటీడీ పరిపాలన భవనంలోని తన చాంబర్‌లో ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదా భార్గవి తో కలసి గురువారం టీటీడీ ఆస్పత్రులపై సమీక్షించారు. ఈఓ మాట్లాడుతూ శ్రీపద్మావతి చిన్న పిల్లల గుండె చికిత్సల ఆస్పత్రిలో ఇటీవలే ఇద్దరికి గుండెమార్పిడి చేశామని, మరో ముగ్గురు చిన్నారులు గుండె మార్పిడి శస్త్రచికిత్స కోసం ఎదురు చూస్తున్నారన్నారు. తిరుపతి ఆస్పత్రుల్లో ఎవరైనా బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి గుండె సేకరించగలిగే అవకాశం లభిస్తే భవిష్యత్తులో ఎక్కువ మంది చిన్నారులకు గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు చేయవచ్చన్నారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, అశ్విని, సెంట్రల్ ఆస్పత్రుల్లోని డాక్టర్లందరికీ ఒకరికి 40 మంది చొప్పున టీటీడీ రెగ్యులర్ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులను కేటాయించి ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన డేటా మొత్తం సిద్ధం చేసి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులతో డాక్టర్లను అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. శ్రీపద్మావతి చిన్న పిల్లల గుండె ఆస్పత్రిలో గుండె మార్పిడి శస్త్ర చికిత్సల కోసం గుండె సేకరణ, రవాణాకు అవసరమైతే ఎయిర్ అంబులెన్స్ కూడా ఉపయోగించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అవసరమయ్యే వైద్య నిపుణుల నియామకం , యంత్ర సామగ్రి కొనుగోలుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. బర్డ్ ఆస్పత్రికి ఆరోగ్య బీమా సంస్థల తో టైఅప్ చేసుకుని సర్జరీలు చేయడానికి అంగీకరించినట్లు ఈఓ తెలిపారు. బర్డ్‌కు ప్రత్యేకంగా వెబ్‌సైట్ సిద్ధం చేయాలన్నారు. ఈ ఆస్పత్రిలో తక్కువ ధరకే చేస్తున్న సీటీ స్కాన్, సీటీ యాంజియో తదితర పరీక్షలపై ప్రచారం చేయాలన్నారు. ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రిలో భద్రతాచర్యల్లో భాగంగా అవసరమైనన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచకర్మ చికిత్సకు సిబ్బందిని నియమించుకోవాలన్నారు. టీటీడీ ఎఫ్ఏసీఏఓ బాలాజీ, శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె చికిత్సల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ నర్మద, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు, వృద్ధులకు అండగా నిలవాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

నారాయణవనం: నేరపూరిత కేసుల విషయంలో చురుగ్గా వ్యవహరిస్తూ, మహిళలు, వృద్ధులకు అండగా నిలవాల ని తిరుపతి జిల్లా ఎస్పీ పర మేశ్వర్‌రెడ్డి సూచించారు. పుత్తూరు రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని, నారాయణవనం పోలీస్ స్టేషన్‌ను తిరుపతి ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. నారాయణవనం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన పోలీసు వందనం స్వీకరించి, మొక్కను నాటారు. సిబ్బంది పనితీరును సమీక్షించి, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు సకాలంలో పూర్తి చేయాలని రూరల్ సీఐ సురేష్‌కుమార్‌కు సూచించారు. ఆయన వెంట పుత్తూరు ఇన్‌చార్జి డీఎస్పీ రామరాజు, సీఐలు లక్ష్మీనారాయణ, శివకుమార్‌రెడ్డి, ఎస్‌ఐలు పరమేశ్‌నాయక్, రామాంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, సునీల్, హనుమంతప్ప తదితరులు ఉన్నారు.

చేసింది రవ్వంత చెప్పకునేది కొండంత



తిరుపతి కల్చరల్: తెలుగు దేశం పార్టీ బీసీలకు చేసింది రవ్వంత.. చెప్పుకొనేది మాత్రం కొండంత అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. గురువారం రష్ ఆస్పత్రిలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మభ్యపెట్టే దగా గోరు షోకేసింగ్ పాలిటిక్స్‌ను టీడీపీ ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ఆపద్భాందవుడు ఎన్టీఆర్ బీసీలకు గట్టి మేలు చేశారని తెలిపారు. ఆయన తర్వాత వట్టి మాటలతో చంద్రబాబు పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ఎన్టీఆర్ బీసీ బ్రాండ్‌ను నేటి తెలుగుదేశం దొంగలించి, బీసీ స్టిక్కరింగ్ వేసుకున్న విషయం నేటి చైతన్యవంతులైన బీసీలకు తెలుసునన్నారు. బీసీలందరికీ ఒక కార్పొరేషన్‌తో 20 ఏళ్ల తెలుగుదేశం పాలన సాగిస్తే 56 బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, ప్రతి బీసీ కులానికి ఆత్మగౌరవాన్ని ఇచ్చిన ఘనత సీఎం జగనన్నదేనని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో రజకులకు సబ్బు బిళ్లలు, ఇస్త్రీ పెట్టెలు, నాయీ బ్రాహ్మణులకు దువ్వెన, కత్తెర్లు, పౌడర్ డబ్బాలు ఇచ్చి బీసీ బంధువని, బ్రాండింగ్ మాస్టర్ అని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.

మద్యం షాపు వాచ్‌మన్‌పై దాడి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపు వద్ద వాచ్‌మన్‌పై పట్టణానికి చెందిన సాయి అనే వ్యక్తి పెట్రోల్ పోసి దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గురువారం రాత్రి మద్యం షాపు మూసివేయడంతో వాచ్‌మన్ షాపు వద్ద కాపలాగా ఉన్నాడు. పట్టణంలోని పడమటి వీధికి చెందిన సాయి అనే వ్యక్తి మద్యం కావాలని షాపు వద్దకు వచ్చాడు. అక్కడ ఉన్న వాచ్‌మన్ మద్యం షాపు మూసివేశారని, కుదరదని చెప్పాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు ఆగ్రహించి, చేతిలో ఉన్న పెట్రోల్ బాటిల్ మూత తీసి, వాచ్‌మన్‌పై పోసి, మద్యం ఇవ్వకపోతే తగులబెడతానంటూ బెదిరిస్తూ దాడి చేశాడు. స్థానికులు గుర్తించి వాచ్‌మెన్‌పై పెట్రోలు పోసి వ్యక్తిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించడంతో వారు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై సీఐ నర్సింహారావు విచారిస్తున్నారు.